క్లుప్తంగా

పల్లె పండుగ ప్రారంభం


మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు

వెంకటగిరి రూరల్: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పెట్లూరు, పంజాం, మొగల్లగుంట, కలపాడు పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీఓ కోటేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా వెంకటగిరి రూరల్ మండలానికి రూ.2 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. మండల పరిధిలోని అన్నీ పంచాయతీలలో పనులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించిన వారోత్సవాలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఏపీఓ దీప, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రెచ్చి పోతున్న అల్లరిమూకలు


యువకుడిపై దాడి చేస్తున్న అల్లరి మూక

గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణ ప్రాంతంలో పలు రకాల వారు జీవనం చేస్తుండడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతోంది. రౌడీ మూకలు ఎక్కువై పోతున్నాయి. పలు మార్లు పోలీసులు ఈ ప్రాంతంలోని టిడ్కో ఇళ్లలో కార్డన్ సెర్చ్ చేసినప్పటికి ఎలాంటి ఫలితం కనిపించడం లేదు. అప్పుడప్పుడు రౌడీలు, అల్లరి మూకలు రెచ్చిపోతున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం ఓ యువకుడిపై అదే ప్రాంతంలోని అల్లరి మూకలు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచాయి. ఈ ఘటనను వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది హల్‌చల్ చేస్తోంది. ఇలాంటి సంఘటనలను పోలీసులు చూసినప్పటికి స్పందించక పోవడంతో అల్లరి మూకలు మరింతగా రెచ్చిపోతున్నాయి.

టీడీపీ వారికే మద్యం దుకాణాలు

వెంకటగిరి(సైదాపురం): నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో జరిగిన మద్యం షాపుల లక్కీ డ్రాలో అధిక సంఖ్యలో టీడీపీ నేతలు, వారి అనుచరులకే దక్కాయి. శ్రీపొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని 4 షాపులు టీడీపీ నేతలకే దక్కడం చర్చనీయాంశంగా మారింది. మండల పార్టీ అధ్యక్షులతోపాటు ఆయన అనుచర వర్గానికే లక్కీడ్రాలో షాపులు దక్కాయి. కలువాయి మండలంలోని ఉన్న రెండు షాపులలు కూడా టీడీపీ నేతల వశమయ్యాయి. సైదాపురం మండలంలో ఉన్న 4 షాపుల్లో 2 షాపులు టీడీపీ నేతలు లక్కీడ్రాలో గెలుపొందారు. తిరుపతి జిల్లా వెంకటగిరి ప్రొహిబిషన్ పరిధిలో వెంకటగిరి పట్టణంలో 9 షాపులకు ఆరు పైగా టీడీపీ నేతలు, వారి అనుచరులకు దక్కాయి. డక్కిలి మండలంలో 3 షాపులకు 1, బాలాయపల్లిలోని 3 షాపులకు 1టీడీపీ నేత దక్కించుకోగా గూడూరుకు చెందిన ఇద్దరు రెండు షాపులను దక్కించుకున్నారు.


ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు


రాత్రివేళల్లో కూడా ఇసుక రవాణా

ఉచితం కాదు.. అక్రమ ఇసుకే!

కాళంగి నంది నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ టీడీపీ నాయకుడు ట్రాక్టర్‌ను ఇలుపూరు వీఆర్‌ఓ శ్రీదేవి అడ్డుకున్నారు. ఇసుక దందాను సెల్ ఫోన్‌లో చిత్రీకరించారు. దీంతో ఆ టీడీపీ నాయకుడు ఆమెపై దురుసుగా ప్రవర్తించాడు. సెల్‌ఫోన్‌ను కిందకు విసిరిపడేశాడు. ఆ తర్వాత ఆ నాయకుడు వీఆర్‌ఓపై దౌర్జన్యం చేశాడు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా మన్నారుపోలూరు వద్ద మార్గమధ్యలోనే దారి మళ్లించిన టీడీపీ నాయకుడు తీసుకెళ్లి పోయాడు. వీఆర్‌ఓ శ్రీదేవి దీనిపై ఆర్డీఓ కిరణ్మయికి తెలియజేశారు. అనంతరం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నామామాత్రంగా ఆ టీడీపీ నాయకుడిపై కేసు నమోదు చేసి చూసీ చూడనట్లుగా వదిలేశారు. పైగా ఈ పని చేసిన వీఆర్‌ఓపై బదిలీ వేటు పడింది. ఇటీవల జరిగిన ఈ సంఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి.

– సూళ్లూరుపేట రూరల్

- యథేచ్ఛగా కాళంగి నది నుంచి ఇసుక తరలింపు
- కూటమి నాయకుల కనుసన్నల్లో దందా
- చోద్యం చూస్తున్న అధికారులు

సూళ్లూరుపేట కాళంగి నదికి గర్భశోకం తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారాన్ని అడ్డు పెట్టుకుని టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. పోటాపోటీగా ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారు.

ఉచిత ఇసుకతో కాసుల వర్షం

సీఎం చంద్రబాబు నాయుడు తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత వెంటనే ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం టీడీపీ నాయకులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ఇష్టారాజ్యంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. వీఆర్‌ఓ లాంటి చిన్నస్థాయి అధికారులు అడ్డుకుంటున్నా అది పెద్దగా ప్రభావం చూపడం లేదు. పైగా అడ్డుకుంటున్న వీఆర్‌ఓలను కూడా బదిలీ చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో కాళంగి నది నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతూనే ఉంది. కొందరు టైరు బండ్ల వద్ద కొనుగోలు చేసుకుని అధిక ధరలకు అమ్ముతుంటే మరి కొందరు టీడీపీ నాయకులు కాళంగి నదిలోకి వెళ్లి ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని ఇలుపూరు, నూకల పాలెం ప్రాంతాల్లో రోజూ పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నారు.


ఇలుపూరు వద్ద కాళంగి ఇసుక అక్రమ డంప్

పడిపోతున్న భూగర్భ జలాలు

కాళంగి నదిలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపట్టడంతో భూగర్భ జలాలు పడిపోయే ప్రమాదముంది. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో వందలాది బోర్లు అడుగంటిపోతున్నాయి. ముఖ్యంగా తాగునీటి సంబంధిత పైపులైన్లు నదికి సమీపంలో ఉండడంతో ఇసుక తరలించే ట్రాక్టర్ల కారణంగా ధ్వంసమవుతున్నాయని నూకలపాళెం గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగుతుంటే రాబోయే రోజుల్లో కాళంగి నది భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ముందస్తు చర్యలు తీసుకున్నాం


డక్కిలి: లింగసముద్రం బ్రిడ్జి వద్దనున్న కొండేరు వాగును పరిశీలిస్తున్న అధికారులు

డక్కిలి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని అత్తల సిద్ధవరం, మాటుమడుగు, డక్కిలి గ్రామాల్లో ఎస్‌ఐ శివశంకర్‌తో కలిసి పర్యటించారు. కొండేరు వాగు ప్రవహిస్తే రాకపోకలకు ఇబ్బందులు ఉంటాయని అత్తల సిద్ధవరం గిరిజన కుటుంబాలకు అవసరమైన బియ్యం పంపిణీ చేశారు. మాటుమడుగు వాగు ప్రవాహం దృష్ట్యా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సంగనపల్లి చెరువు దగ్గర కలుజు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలను నియంత్రించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

స్పెషల్ ఆఫీసర్లు ఎక్కడ?

డక్కిలి మండలంలో సహాయక చర్యలు చేపట్టేందుకు డక్కిలి తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు మండలంలోని 14 సచివాలయాల్లో మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. అయితే సోమవారం స్పెషల్ ఆఫీసర్లు ఎవ్వరూ సచివాలయాల్లో కనిపించకపోవడం విశేషం. మంగళ, బుధ, గురువారాల్లో నెల్లూరు, తిరుపతి జిల్లాలో తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని జిల్లా స్థాయి అదికారులు చెబుతున్నా ప్రత్యేక అధికారుల్లో చలనం లేకపోవడం ఆశ్చర్యకరం.

పూర్తయిన మద్యం టెండర్లు

సూళ్లూరుపేట: తిరుపతిలో సోమవారం నిర్వహించిన లాటరీలో షాపులు వచ్చిన వాళ్లలో ఆనందం, రాని వాళ్లలో విషాదం కనిపించింది. ప్రతి దరఖాస్తుదారుడి నుంచి రెండు లక్షలు డిపాజిట్ కట్టించుకున్నారు. అయితే షాపు రాకపోయేసరికి రెండు లక్షలు పోయాయనే నిట్టూర్పులతో ఇంటి ముఖం పట్టారు. తెలుగు తమ్ముళ్లంతా కూడా గ్రూపులుగా మారి దరఖాస్తులు వేసినప్పటికీ లాటరీలో పేర్లు రాకపోవడంతో ఇబ్బందిగా ఫీలయ్యారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని రెండు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని ఆరు మండలాల పరిధిలో 38 మద్యం షాపులకు 619 మంది దరఖాస్తు చేశారు. నాయుడుపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాయుడుపేట మున్సిపాలిటీలో 13 షాపులకు 111 మంది దరఖాస్తు చేశారు. ఓజిలి మండలంలో రెండు షాపులకు 50 మంది, పెళ్లకూరు మండలంలో రెండు షాపులకు 44 మంది దరఖాస్తు చేశారు. సూళ్లూరుపేట ఎక్సైజ్ శాఖ పరిధిలో సూళ్లూరుపేట మున్సిపాలిటీలో 14 షాపులకు 142 మంది, దొరవారిసత్రం మండలంలో రెండు షాపులకు 35 మంది, తడ మండలంలో అయిదు షాపులకు 141 మంది దరఖాస్తులు చేశారు. అయితే తడ మండలం మీద అంతా దృష్టి పెట్టి దరఖాస్తులు చేశారు. తడ మండలం తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడం, తమిళనాడులో మద్యం రేట్లు అధికంగా ఉండడమే ఇందుకు కారణం. అయితే సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి 619 దరఖాస్తుదారుల నుంచి రూ.12.38 కోట్లు ప్రభుత్వానికి వెళ్లాయి. ఇందులో 38 షాపులకు రూ.7,50 కోట్లు పోను మిగిలిన రూ.5 కోట్లు దరఖాస్తుదారులు వదులుకున్నవే కావడం విశేషం.

అనుయాయులకే పెద్ద పీట

చిల్లకూరు: ప్రైవేటు మద్యం దుకాణాలు టీడీపీ అనుయాయులకే దక్కేలా చేశారు. గూడూరు నియోజకవర్గంలోని గూడూరు ఎక్సైజ్ పరిధిలో 18 దుకాణాలు, వాకాడు ఎక్సైజ్ పరిధిలో 15 దుకాణాలు ఉన్నాయి. వీటిలో రెండు దుకాణాలు మాత్రమే ప్రైవేటు వ్యక్తులకు దక్కగా మిగిలినవి అధికార పార్టీవారే దక్కించుకున్నారు. ఇలా దుకాణాల వేలం దక్కించుకోవడంలో పూర్తిగా ప్రజా ప్రతినిధితోపాటుగా ఆయన గాడ్ ఫాదర్‌లు పావులు కదిపినట్లు తెలుస్తోంది. దుకాణాలకు పక్కనే ఏర్పాటు చేసే పర్మిట్ రూమ్‌ల వేలం మిగిలింది. దీనికి కూడా స్థానిక ప్రజా ప్రతినిధి గతంలో తనకు తెలియకుండా పర్మిట్ రూమ్‌లు ఇవ్వకూడదని ఆదేశాలు ఇచ్చి ఉన్నారు. దీంతో పర్మిట్ రూమ్‌లు కూడా తమకు దక్కవని మద్యం వ్యాపారులు నిమ్మకుండి పోతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

వెంకటగిరి రూరల్: నలభయ్యేళ్ల తరువాత పట్టణంలోని ఆర్వీఎం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు సోమవారం కలుసుకున్నారు. 1983–84వ సంవత్సరం ఎంకేజీఎం యూపీ పాఠశాలకు చెందిన 7వ తరగతి పూర్వ విదార్థులు ఆ పాఠశాల కరస్పాండెంట్ అల్లం కృష్ణయ్య కుమార్తె అల్లం భారతిదేవి ఆధ్వర్యంలో సమావేశమై అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదపూజ చేసి, శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు డక్కిలి సుబ్బరామయ్య, చిట్టిబాబు, కోటేశ్వరరావు, పోలయ్య, అమృత, విజయలక్ష్మి, ప్రసన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటో అదుపుతప్పి వ్యక్తికి గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో కింద పడిఉన్న క్షతగాత్రుడు

బాలాయపల్లి(సైదాపురం): ఆటో అదుపుతప్పి వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన బాలాయపల్లి–గూడూరు మార్గంలోని చుట్టి గ్రామం సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గూడూరు రూరల్ మండలం చెన్నూరుకి చెందిన పుట్టపు వెంకటేశ్వర్లు తన ఆటోలో తిరుపతి నుండి బాలాయపల్లి మీదుగా చెన్నూరుకి వెళ్తున్నారు. చుట్టి గ్రామ సమీపంలో గేదె అడ్డు రావడంతో ఆటో అదుపుతప్పి సమీపంలోని ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈఘటనలో ఆటో నడుపుతున్న వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే రోడ్డు ప్రమాదంపై 108కు సమాచారం అందించిన 1.30 గంటలకు వాహనం ఘటనా స్థలం చేరుకుంది.

మిద్దెపై నుండి పడి వృద్ధురాలికి గాయాలు

బాలాయపల్లి(సైదాపురం): మిద్దెపై నుండి కాలు జారి కిందపడి వృద్ధురాలు తీవ్ర గాయాల పాలైంది. ఈ ఘటన బాలాయపల్లి మండలంలోని కయ్యూరు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు కయ్యూరు గ్రామానికి చెందిన సుబ్బమ్మ తన మిద్దెపైన ఉన్న బాత్‌రూమ్‌లోకి వెళ్తున్న సమయంలో కాలుజారి కింద పడిపోయింది. దీంతో తలకు బలమైన గాయం తగలగా, కాలు విరిగినట్లు స్థానికులు తెలియజేశారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైలు కింద పడి యువకుడి మృతి

దొరవారిసత్రం : డీవీ సత్రం సమీపంలోని అండర్ పాస్ వంతెన వద్ద రైలు కింద పడి ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని కట్టువాపల్లె ఎస్సీ కాలనీకి చెందిన ఈదూరు రాజేంద్రప్రసాద్ (32) ఇంటి నుంచి రెండు రోజుల క్రితం వచ్చేశాడు. కుటుంబీకులు గాలించినా ఆచూకీ దొరకలేదు. రైల్వే కీమన్ గురయ్య సోమవారం రైలు పట్టాలపై రాజేంద్ర ప్రసాద్ మృతదేహాన్ని గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువకుడికి మతిస్థిమితం లేదని, ఈ క్రమంలోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని గ్రామస్తులు తెలియజేశారు. ఈ మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాబిడ్డల అదృశ్యంపై ఆందోళన

వెంకటగిరి రూరల్ : వివరాలు.. మండలంలోని తిమ్మాయిగుంట దళితవాడలో బాపన అంకయ్య, స్వప్న దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఏప్రిల్ 7వ తేదీన భార్యాభర్తలకు గొడవ జరిగింది. దీనిపై స్వప్న తన భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు వారిరువురికీ కౌన్సెలింగ్ ఇచ్చి పంపేశారు. అదే రోజు వేకువజామున స్వప్న తన కుమార్తెను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అంకయ్య, కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టినా స్వప్న ఆచూకీ దొరకలేదు. దీంతో ఏప్రిల్ 15వ తేదీన అంకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే 6 నెలలు గడుస్తున్నా తన భార్య ఆచూకీ తెలియరాలేదని అంకయ్య ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు.

వరినాట్లు వేయొద్దు


రెవెన్యూ కార్యాలయంలో సమావేశమైన తహసీల్దారు, ఎంపీడీఓ, కమిషనర్

నాయుడుపేట టౌన్: భారీ వర్షాల కారణంగా వరి నార్లు వేసుకునే రైతులు కొద్ది రోజులు వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జోగి గణేష్ సోమవారం సూచించారు, నార్లు పోసిఉన్న రైతులు కూడా నారు మడులలో ఎక్కువ శాతం నీరు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో సమీక్ష

రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ గీతావాణి, ఎంపీడీఓ సురేశ్ బాబు, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాలు సమావేశమయ్యారు. పట్టణ, మండల పరిధిలో ఉండే లోతట్టు ప్రాంతాలు, గ్రామాలు తదితర ప్రాంతాల పరిస్థితులను తెలుసుకున్నారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు

విద్యుత్ శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు డీఈ వరప్రసాద్‌రెడ్డి తెలిపారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కువ సమయం విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై 83309 41205 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

వైఎస్‌ఆర్ సీపీ అభివృద్ధే లక్ష్యం


మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన చిందేపల్లి

పెళ్లకూరు: వైఎస్‌ఆర్ సీపీ అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కార్యకర్తలకు తోడుగా నిలవాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం తిరుపతిలో పెద్దిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ పరిస్థితిని వివరించినట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సైదాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం కారణంగా జిల్లా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమాదేవి కోరారు. మండల కేంద్రమైన సైదాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తుపాన్ ప్రభావంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల, గ్రామ స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. ప్రతి అధికారి తాము పనిచేసేచోట్ల ఉండాలని ఆదేశించారు. ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, డీటీ అనురాధ తదితరులున్నారు.

సైదాపురంలో వర్షం

మండలంలో తుపాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రైతులు వ్యవసాయ పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సైదాపురం–పాదలకూరు రహదారిపై వర్షం వాహన చోదకులను మరింత ఇబ్బందులకు గురి చేస్తోంది

పెళ్లకూరులో...

పెళ్లకూరు: భారీ వర్షాల నేపథ్యంలో స్వర్ణముఖినది పరిసర ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూచించారు. సోమవారం ఆయన కలవకూరు–పుల్లూరు చెక్‌డ్యామ్ వద్ద వరద తీవ్రతను ఆయన పరిశీలించారు. వారం రోజులుగా స్వర్ణముఖినదికి తెలుగు గంగ జలాలు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరద ప్రవాహం ఎక్కువయ్యే అవకాశం ఉండడంతో కాజ్‌వేపై ద్విచక్ర వాహనదారులు, పాదచారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో అధికారులకు సమాచారం అందించి తగిన సాయం తీసుకోవాలని సూచించారు. అలాగే పాలచ్చూరు మామిడి కాలువ వద్ద కూడా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట స్థానిక ఎస్‌ఐ నాగరాజు, ఏఎస్‌ఐ మునస్వామి, సిబ్బంది ఉన్నారు.


తీరప్రాంత గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు


అధికారులతో సమీక్ష

డీవీ సత్రంలో 40.6 ఎంఎం వర్షపాతం

దొరవారిసత్రం: మండల పరిధిలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. 40.6 వర్షపాతం నమోదు అయినట్లు తహసీల్దార్ శైలకుమారి తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలైన వేటగిరిపాళెం, బురదమడుగు, కొత్తకండ్రిగ, తనియాలి ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ గోవర్ధన్, ఎస్‌ఐ అజయ్‌కుమార్ పర్యటించి, ప్రజలను అప్రమత్తం చేశారు. 12 పునరావాస కేంద్రాలను అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆపద సమయంలో డీవీ సత్రం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 8341614507 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆమె తెలియజేశారు.

విద్యుత్‌కు తీవ్ర అంతరాయం

డీవీ సత్రం మండలంలో కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. డీవీ సత్రం, ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం తదితర గ్రామాల్లో విద్యుత్ తీగలు మరమ్మతులకు గురికావడంతో ఆదివారం రాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ఆగిపోయింది. తిరిగి సోమవారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

కోటలో..

కోట: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయజయరావు సూచించారు. సోమవారం మండలంలోని తీరప్రాంత గ్రామాలైన కొత్తపట్నం, గోవిందుపల్లి, గోవిందుపల్లిపాళెం, శ్రీనివాససత్రంలో పర్యటించారు. మత్స్యకారుల వేటకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తుపాను షెల్టర్లలో వసతులను తహసీల్దార్ పరిశీలించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తుపాను కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వేయర్ గోపి, వీఆర్‌ఓ శ్రీనివాసులు తహసీల్దార్ వెంట ఉన్నారు.

రాపూరులో భారీ వర్షం

రాపూరు: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రోడ్లన్నీ జలమయం కావడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. నిమ్మ చెట్లకు నీరులేక ఎండిపోతుండడంతో ఈ వర్షం రైతులకు కొంత ఊరట కలిగించింది,

అధికార గణం అప్రమత్తం

సూళ్లూరుపేట: తూర్పు ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి తీర ప్రాంత గ్రామాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. దీంతో సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి యాదవ్ ఆధ్వర్యంలో అధికారులందరినీ అప్రమత్తం చేశారు. మంగళ, బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. తుపాన్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశారు. పునరావాస కేంద్రాలను కూడా సిద్ధంగా ఉంచారు. సోమవారం పాఠశాలలు, అంగన్‌వాడీలకు సెలవు ప్రకటించారు.


తనియాలి ఎస్టీ కాలనీలో అధికారులు


స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద డీఎస్పీ చెంచుబాబు


సైదాపురంలో వర్షం


రాపూరులో కురుస్తున్న వర్షం

కండలేరులో 31.563 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 31.563 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. కండలేరు వరద కాలువ నుంచి 150 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోందన్నారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8250 క్యూసెక్కుల నీరు చేరుతోంది. సత్యసాయిగంగ కాలువకు 1450, పిన్నేరు కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.